సాక్షి ఖమ్మం

సోమవారం । 7 । జూలై । 2025



ఉన్నత చదువులకు 'ఓపెన్'

వివిధ కారణాలతో చదవలేకపోయిన వారు, మధ్యలో మానేసిన వారికి ఓపెన్ విద్యా విధానం ఉపకరిస్తోంది. 8లో



.. పెరుగుతున్న స్వరం

మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాల నేపథ్యంలో విలీన గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలంటున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం

30° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ములుగు, భద్రాద్రి జిల్లాల్లో తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం భద్రాద్రి, ములుగు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదలైంది. సోమవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 11.30 గంటలకు ములుగు జిల్లా వాజేడు చేరుకుంటారు. అక్కడ మొక్కజొన్నల రైతులకు మంత్రి సీతక్కతో కలిసి చెక్కులు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బి.జి.కొత్తూరులో మర్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పరిశీలిస్తారు. 3.30 గంటలకు భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు కొత్తగూడెం ఐడీఓసీలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

గురుకులాల్లో పరిశుభ్రత పాటించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



గురుకులంలో కిచెన్ షెడ్డు వద్ద పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కారేపల్లి: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కారేపల్లి ఎస్‌ఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో నిర్వహిస్తున్న వైరా మైనారిటీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. వసతులపై ఆరా తీశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా.. స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో వచ్చిన ఫలితాలు, విద్యార్థినుల ప్రగతిని తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కారేపల్లిలో నిర్వహిస్తున్న మైనార్టీ బాలికల గురుకులాన్ని ఖమ్మం, వైరా పట్టణాల సమీపంలోకి తరలిస్తున్నారనే వార్తలు రావడం, అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

అనర్హులతో డీసీఈబీ సెక్రటరీ పోస్టు భర్తీ

హెచ్‌ఎంల అసోసియేషన్ ఆరోపణ



మాట్లాడుతున్న వీరస్వామి

ఖమ్మం సహకారనగర్ : డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) సెక్రటరీ పోస్టును అర్హత లేని వారితో భర్తీ చేశారని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వీరస్వామి, టి.నాగేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని ఇందిరానగర్ పాఠశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ డీసీఈబీ సెక్రటరీ ఎంపికలో నిబంధనలను తుంగలో తొక్కారని అన్నారు. బోర్డును రద్దు చేసినట్లు డీఈఓ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాజాగా నియమించిన సెక్రటరీపై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయని, అలాంటి వ్యక్తిని మళ్లీ ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో హెచ్‌ఎంలు రాయల శ్రీనివాసరావు, చావా శ్రీనివాసరావు, చిరంజీవి నాయుడు, ఆర్.వెంకటరావు, వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలోని ఓ స్వీట్ షాప్‌లో గుర్తించిన హానికర రంగులు, క్రీమ్‌తో అధికారులు (ఇన్‌సెట్) ఖమ్మంలోని ఓ ఆహార తయారీ కేంద్రంలో సీజ్ చేసిన ఆహార పదార్థాలు, ముడి సరుకులు (ఫైల్)

అంతా కల్తీ.. తనిఖీలు నాస్తి!

- ఆహారంలో నాణ్యత లేదు.. అధికారుల్లో కదలిక ఉండదు
- రెస్టారెంట్లు, హోటళ్ల కిచెన్లలో అపరిశుభ్ర వాతావరణం
- నామమాత్రంగా తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు
- శాంపిళ్లతోనే సరి.. చర్యలు శూన్యం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టడంతో పాటు నాణ్యత నిర్ధారణకు ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఆహార భద్రత అధికారులు ఆ దిశగా దృష్టి పెట్టడం లేదు. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లతోపాటు ఇతర ఆహార పదార్థాల తయారీ కేంద్రాల్లో నాణ్యత కొరవడుతోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే, లేదా హైదరాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్ బృందాలు వచ్చినప్పుడు మాత్రమే జిల్లా అధికారులు హడావుడి చేస్తున్నారు. అప్పుడు సైతం శాంపిళ్ల సేకరణతోనే సరిపెడుతున్నారు. దీన్ని ఆసరా చేసుకుని హోటళ్లు, రెస్టారెంట్లలో నాసిరకమైన, కాలం చెల్లిన పదార్థాలను వండి వడ్డిస్తున్నారు.

పైపై మెరుగులే..

సాధారణంగా రెస్టారెంట్లు, హోటళ్లలో వినియోగదారులను ఆకట్టుకునేలా అలంకరణ, లైటింగ్, సంగీతం వంటి ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆహారం కూడా ఈ స్థాయిలో బాగుంటుందనే నమ్మకంతో పలువురు కుటుంబాలతో సహా వస్తుంటారు. కానీ లోపల కిచెన్, ఆహారం నిల్వ చేసే ఫ్రిజ్ వంటివి అపరిశుభ్రతకు నిలయాలుగా ఉంటున్నాయి. రిఫ్రిజిరేటర్లు, కోల్డ్ చాంబర్లలో నిర్ణీత ఉష్ణోగ్రతలు ఉండటం లేదు. కొన్ని ఖరీదైన హోటళ్లలో కూడా కిచెన్‌లో దోమలు, ఈగలు, కిచెన్ బయటే మురుగునీటి ప్రవాహం సర్వసాధారణమైంది. ముడి పదార్థాలపై ఈగలు వాలుతున్నా ఎవరూ పట్టించుకోరు. ఇటీవల నగరంలోని పలు హోటళ్లలో ఆహార భద్రత అధికారుల తనిఖీ చేయగా ఇలాంటి వాతావరణం ఉన్నట్లు తేలింది.

తనిఖీలు నామమాత్రమే..

జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర దినుసుల తయారీ కేంద్రాల్లో ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించాలి. కానీ జిల్లా అధికారులు ఆ దిశగా పని చేయడం లేదు. హోటళ్లపై ఫిర్యాదు వచ్చినప్పుడు, హైదరాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్ బృందాలు వచ్చిన సమయంలోనే హడావుడి చేస్తున్నారు. తనిఖీలు చేసినప్పుడు అక్కడ పరిస్థితులన్నీ పరిశీలించినా.. శాంపిళ్ల సేకరణతోనే సరిపెడుతున్నారు. వాటిని పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌లకు పంపి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత పరీక్షల ఫలితం ఏం వచ్చింది.. సంబంధిత హోటళ్లు, రెస్టారెంట్లపై ఏం చర్యలు తీసుకుంటున్నారనేది ఎవరికీ తెలియడం లేదు. నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలపై ఎలాంటి హానికరమైన రంగులు వాడకూడదు. అయినా పలు హోటళ్లు, స్వీట్ల తయారీ కేంద్రాల్లో విచ్చలవిడిగా రంగులు వినియోగిస్తున్నారు. వీటిని అధికారులు పరిశీలించినా ఎలాంటి చర్యలకు సిఫార్సు చేయడం లేదు.

నూతనంగా ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు..

జిల్లాలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి డివిజన్లు ఉండగా.. ముగ్గురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అవసరం. ప్రస్తుతం జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వారిద్దరినీ ఇటీవలే నియమించడంతో ఇంకా శాంపిళ్లు సేకరించే అధికారం ఇవ్వలేదు. ఇప్పటివరకు ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉండటంతో తనిఖీలు కూడా పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయారు. కొత్తగా నియమించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు శాంపిళ్లు సేకరించాలంటే మరో పది రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇక మూడు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే హోటళ్లు, రెస్టారెంట్‌లు కాకుండా నగరంలో 1000కి పైగా తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. వీరిలో 500 మంది నిర్వాహకులకు మాత్రమే శిక్షణ ఇచ్చారు. మరో 500 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఇంకా కొన్ని తోపుడుబండ్లు, ఇతర టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు లైసెన్స్ కూడా తీసుకోలేదు. ఇకనైనా జిల్లాలో ఆహార భద్రత అధికారులు తరచుగా తనిఖీలు నిర్వహిస్తేనే హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార విక్రయాలు అరికట్టే వీలవుతుంది.

◆ రోజుల తరబడి నిల్వ..

హోటళ్లు, రెస్టారెంట్లలో ముడి పదార్థాలను రోజుల తరబడి నిల్వ చేస్తున్నారు. కొన్ని హోటళ్లలో కల్తీ ఆహార పదార్థాలనే వడ్డిస్తున్నారు. ఇలా కల్తీని గుర్తించిన పలువురు వినియోగదారులు ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయగా, తనిఖీలకు వచ్చిన అధికారులే విస్తుపోయేలా అక్కడి పరిస్థితులున్నాయి. మరోవైపు ఆహార పదార్థాలపై హానికరమైన రంగులు కూడా వాడుతున్నట్లు గుర్తించారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం పలు హోటళ్లు, రెస్టారెంట్లు, మసాలా దినుసులు, పచ్చళ్ల తయారీ కేంద్రాలపై శుక్రవారం దాడులు నిర్వహించి, అక్కడి వాతావరణం అధ్వానంగా ఉన్నట్లు గుర్తించింది. అలాగే జిల్లా వ్యాప్తంగా కర్రీ పాయింట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పలుచోట్ల నాసిరకమైన కూరగాయలను తక్కువ ధరకు కొనుగోలు చేసి టేస్టీ మసాలాలు జోడించి కూరలు, పప్పు, చికెన్, చేపలు వంటివి విక్రయిస్తున్నారు. ఉదయం వండిన కూరలే రాత్రి వరకూ అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



రామయ్యకు సువర్ణ పుష్పార్చన



ఆలయంలో భక్తుల కోలాహలం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం సువర్ణ పుష్పార్చన, అభిషేకం వేడుకలను కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత పల్లకీ సేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశాక స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను వైభవంగా జరిపించారు. కాగా, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. గోదావరిలో పుణ్యస్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కిన్నెరసానిలో జలవిహారం

పాల్వంచరూరల్:కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి సౌందర్యాల నడుమ సేదతీరారు. 510 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్ లైఫ్ శాఖకు రూ.27,630 ఆదాయం లభించింది. 250 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,030 ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదల ఆత్మగౌరవం కోసమే ఇందిరమ్మ ఇళ్లు

- రాజకీయాలకతీతంగా మంజూరు చేస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



ఇంటి మంజూరుపత్రం అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ అనుదీప్

మధిర: పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, ప్రతీ పేదవాడి సొంతింటి కల సాకారం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి విడతలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. గతంలో తన పాదయాత్ర సందర్భంగా ప్రజల బాధను నేరుగా తెలుసుకున్నానని, వాటి పరిష్కారమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. 93లక్షల రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. నిరుపేదల పిల్లలకు నాణ్యమైన విద్య కోసం యంగ్ ఇండియా గురుకులాలు నిర్మిస్తున్నామని, గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీల పెంపుతో పాటు 56వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. రాజీవ్ యువ వికాసం కింద రూ. 8వేల కోట్లతో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ సంక్షేమ పథకాలు అందేలా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సన్న రకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందించామని, రూ.2 లక్షల లోపు వ్యవసాయ రుణాలు మాఫీ చేశామని, రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.12 వేల రైతు భరోసా అమలు చేస్తున్నామని అన్నారు.

వడ్డీ లేని రుణాలు..

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ఒక్కో కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. మధిర ప్రాంత ప్రజలకు గౌరవం కలిగేలా పనిచేస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ప్రకటించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్, ఇటుక తదితర సామగ్రి ధరలు పెరగకుండా మండల స్థాయి అధికారులు నియంత్రించాలని ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో 1,544 మంది పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అందించడం సంతోషంగా ఉందన్నారు. అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేస్తున్నామని, మొదటి విడతలో రాని వారు ఆందోళన చెందొద్దని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ ఎస్ఈ సరిత, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, నాయకులు సూరంశెట్టి కిశోర్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న గుంటుపల్లి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ సభ్యులకు రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో సుమారు 3,500 మంది సభ్యులు ఉన్నారని, ఇందులో సగం మందికే ఇళ్ల స్థలాలు వచ్చాయని, మిగతా వారికి రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు నాలుగు బ్లాక్‌లు టీఎన్జీవోస్ హౌస్ బిల్డింగ్ సొసైటీలకు కేటాయించాలని తీర్మానించామని అన్నారు. మధ్య తరగతి ఉద్యోగులు టీఎన్జీవోస్‌లో అధికంగా ఉన్నారని, అందరికీ న్యాయం చేయాలని కోరారు. అనంతరం టీఎన్జీవోస్ సెంట్రల్ కమిటీకి ఎన్నికైన బాలకృష్ణ, జైపాల్ విజయ్‌కుమార్‌తో పాటు ఇటీవల పదోన్నతులు పొందిన ఎర్రమల శ్రీనివాసరావు, నాగరాజును సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొణిదన శ్రీనివాస్, నాయకులు కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, శ్రీధర్ సింగ్, ప్రకాశరావు, కరణ్‌సింగ్, తాళ్లూరి శ్రీకాంత్, చంద్రశేఖర్, ఏలూరి హరికృష్ణ, రాధికారెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆదివారం తొలి ఏకాదశి పండుగ కావడంతో మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరపగా, భక్తులు క్యూలైన్ ద్వారా దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్. రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి తాంబాళం బహూకరణ

పెద్దమ్మతల్లి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్త దంపతులు పాల్కంపల్లి ప్రసాద్, అరుణ రూ.7,116 విలువైన వెండి తాంబాళం బహూకరించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అంగన్‌వాడీల్లో అరకొర వసతులే..

- నగం కేంద్రాలకే సొంత భవనాలు
- విద్యార్థులు, గర్భిణులకు అనుకూలంగా లేని అద్దె బిల్డింగులు
- టాయిలెట్లు లేక అవస్థలు
- నిధులున్నా.. నిర్మాణాలు లేవు



ఖమ్మం బుర్హాన్‌పురంలో బోర్డు కూడా సక్రమంగా లేకుండా అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు అరకొర సౌకర్యాలతోనే నడుస్తున్నాయి. సగం కేంద్రాలకు సొంత భవనాలు లేవు. కొన్నిచోట్ల మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. చిన్నారులకు పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సేవలు అందించే ఈ కేంద్రాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక కొందరు తల్లిదండ్రులు తమ చిన్నారులను ఆయా కేంద్రాలకు పంపించడం లేదు.

అద్దె భవనాలతో అవస్థలు..

జిల్లాలో మొత్తం 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 940 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 900 సెంటర్లలో 440 భవనాలు అద్దె లేకుండా, 460 కేంద్రాలను అద్దె చెల్లించి నిర్వహిస్తున్నారు. ఇక అద్దె భవనాలు చాలా చిన్నగా.. సరైన గాలి, వెలుతురు లేకుండా ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల ఈ భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. అయినా వాటిలోనే కేంద్రాలను కొనసాగిస్తుండడం గమనార్హం. ఇక ప్రీ స్కూల్‌గా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సరైన ఆహ్లాదకర వాతావరణం ఉండడం లేదు. ఆడుకునేందుకు, సరదాగా కాసేపు బయట తిరిగేందుకు కూడా స్థలం లేక ఒకేచోట కూర్చోవాల్సి వస్తోంది. ఆట వస్తువులు కూడా అందుబాటులో ఉండడం లేదు. ఇక వర్షం వస్తే స్లాబ్‌లు కురుస్తుండగా చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

వసతులూ అంతంతే..

కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం వంటి కనీస వసతులు లేకపోవడం అతి పెద్ద సమస్యగా మారింది. మరుగుదొడ్లు ఉన్నా.. పరిశుభ్రత కొరవడుతోంది. సురక్షిత తాగునీరు అందుబాటులో లేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అరకొర సౌకర్యాలతో నడుస్తున్న ఈ కేంద్రాలు తమ పిల్లల ఆరోగ్యానికి, భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయని అంటున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షలు, పౌష్టికాహారం కోసం కేంద్రాలకు వచ్చినప్పుడు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

నిధులున్నా నిరుపయోగమే..

వివిధ పథకాల కింద అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరవుతున్నాయి. 2024 – 25లో 20, 2025 – 26లో మరో 20 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరయ్యాయి. ఎన్ఆర్ఈజీఎస్, ఏడీఐబీ, డీఎంఎఫ్ఏ, ఎమ్మెల్యే కోటా కింద నిధులు విడుదల చేస్తున్నారు. అధికారులు స్థలాలను పరిశీలించి అక్కడ నిర్మించాలని సూచిస్తున్నారు. కానీ ఇప్పటివరకు 40 భవనాలకు నిధులు మంజూరైతే పనులు ప్రారంభించింది నాలుగు మాత్రమే కావడం గమనార్హం.

జిల్లాలో అంగన్‌వాడీ భవనాల వివరాలిలా..

తాగునీటి నదుపాయం లేనివి	296
విద్యుత్ సౌకర్యం లేని కేంద్రాలు	659
టాయిలెట్లు లేని సెంటర్లు	576
మొత్తం విద్యార్థులు	10,094 మంది
బాలురు	5,303
బాలికలు	4,791

ఆధ్యాత్మిక సందడి..

హిందూ, ముస్లింలకు సంబంధించిన తొలి ఏకాదశి, మొహర్రం పండుగలు ఆదివారం ఒకేరోజు రావడంతో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జిల్లాలోని పలు ఆలయాల్లో దైవ దర్శనం కోసం భక్తులు బారులుదీరగా.. పీరీల ఊరేగింపుతో పల్లెలు, పట్టణ వీధులు కళకళలాడాయి. ఖమ్మం నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి, కమాన్‌బజార్ వేంకటేశ్వరస్వామి, ఇందిరానగర్ రామాలయం, కాల్వొడ్డు ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఇక ఖమ్మం ఖిల్లా తదితర ప్రాంతాలు పీరీల ఊరేగింపుతో సందడి నెలకొంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం



నర్సింహస్వామి ఆలయం వద్ద బారులు దీరిన భక్తులు

క్లుప్తంగా

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



నివాళులర్పిస్తున్న దుర్గాప్రసాద్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ భారతదేశ చరిత్రలో మహోన్నతమైన వ్యక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్‌గౌస్, సయ్యద్ ముజాహిద్, హుస్సేన్, గజ్జెల్లి వెంకన్న, మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వేంకటేశ్వరరావు, యడ్లపల్లి సంతోష్, జెర్రిపోతుల అంజనీకుమార్, మిక్కిలినేని నరేంద్ర, కొట్టేముక్కల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

- వ్యక్తి దుర్మరణం

ములకలపల్లి: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణంపాలయ్యాడు. కొత్తగంగారం అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఇలా తెలిపారు. అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామానికి చెందిన కుర్సం అర్జున్‌రావు(38) స్నేహితులతో కలిసి ట్రాక్టర్‌పై ములకలపల్లి మండలంలోని పాతగుండాలపాడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూత్రవిసర్జన నిమిత్తం ట్రాక్టర్‌ను కొత్తగంగారం అటవీ ప్రాంతంలో ఆపగా.. అటు వైపుగా వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న అర్జున్‌రావు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం

- నలుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఒరిస్సా నుంచి తీసుకొచ్చి స్థానికంగా గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి సోములగూడెం వైపు వెళ్లే మార్గంలో ఆదివారం ఎస్సై సురేష్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో జామాయిల్ తోటలో పాల్వంచకు చెందిన షకీర్, గోపి, జగన్నాథపురం గ్రామానికి చెందిన చరణ్, శ్రీరాంలు అనుమానస్పదంగా సంచరించడంతో వారిని పట్టుకుని విచారించారు. దీంతో వారి వద్ద ఒరిస్సాలోని బెజంగూడా నుంచి రూ.19వేల విలువ కలిగిన 380 గ్రామాల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉన్నత చదువులకు ‘ఓపెన్’

- పదో తరగతి, ఇంటర్ చదివే అవకాశం
- ఈనెల 11 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 56 స్టడీ సెంటర్లు



స్టడీ సెంటర్‌లో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ పాపారావు (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: ఓపెన్ స్కూల్ అనేది ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి ఓ వరం లాంటిది. వివిధ కారణాలతో విద్యను అభ్యసించలేకపోయిన వారు, చదువును మధ్యలోనే నిలిపివేసిన వారు, తమ వయసుతో సంబంధం లేకుండా మళ్లీ విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సదవకాశాన్ని ఇచ్చింది. ఓపెన్ స్కూల్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అందిస్తారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారు ఈ ఓపెన్‌స్కూల్స్‌లో చేరేందుకు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2008వ విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ విధానం ప్రారంభం కాగా.. అప్పటి నుంచే పదో తరగతి ప్రారంభించారు. 2010–11వ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్‌ను ప్రారంభించారు.

56 కేంద్రాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 56 ఓపెన్ స్కూల్ కేంద్రాలుండగా... అందులో ఖమ్మం జిల్లాలో 25 సెంటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 31 కేంద్రాలున్నాయి. చిన్నప్పటి నుంచి చదువుకోకపోయినా సరే నేరుగా పదో తరగతిలో చేరే అవకాశం వీటి ద్వారా కలుగుతుంది. వయోజనులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తాము ఉన్నత విద్యావంతులుగా మారేందుకు కృషి చేసుకోవచ్చు.

అర్హతలిలా...

పదో తరగతిలో చేరాలనుకునే వారికి 31–08–2025 నాటికి 14 సంవత్సరాలు నిండాలి. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 15 సంవత్సరాలు నిండి ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. చదివిన తరగతులకు సంబంధించిన టీసీ, బోనఫైడ్ జత చేయాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారు మాత్రం తప్పకుండా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

ఈ నెల 11వ తేదీ తుది గడువు..

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకునే ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు అధ్యయన కేంద్రంలో సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా అపరాధ రుసుం పదో తరగతికి రూ.100, ఇంటర్మీడియట్‌కు రూ.200లతో ఆగస్టు(వచ్చే నెల) 12వ తేదీ వరకు మీ సేవా, ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫీజులు

పదో తరగతికి జనరల్ పురుషులకు రూ.1,550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీలు, మహిళలకు రూ.1,150 చెల్లించాలి. ఇంటర్మీడియట్‌కు జనరల్ పురుషులకు రూ.1,800, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగులకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతి అడ్మిషన్ పొందేందుకు గాను వయస్సు ధ్రువీకరణ కోసం పుట్టిన తేదీని తెలిపే ఏదైనా పాఠశాల రికార్డు షీట్/టీసీ లేదా మున్సిపల్ అధికారి/ తహసీల్దార్/జిల్లా జనన మరణ రిజిస్ట్రార్ జారీ చేసిన పుట్టిన తేదీ ధ్రువపత్రం సమర్పించాలి. వచ్చే నెల 31 నాటికి 14 ఏళ్లు నిండి ఉన్న వారు తమ ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు తీసుకెళ్లాలి. అలాగే ఇంటర్‌లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ అదనంగా సమర్పించాల్సి ఉంటుంది.

కొత్త కేంద్రాలివే...

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి ఆసక్తి పెరుగుతున్న క్రమంలో జిల్లాలో కొత్తగా జెడ్పీహెచ్‌ఎస్ రఘునాథపాలెం, జెడ్పీహెచ్‌ఎస్ ఏదులాపురం, జీహెచ్‌ఎస్ నేలకొండపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ తల్లాడలలో అదనంగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జెడ్పీహెచ్‌ఎస్ కరకగూడెం, అశ్వాపురం మండలం జెడ్పీహెచ్‌ఎస్ మిట్టగూడెం, జెడ్పీహెచ్‌ఎస్ ఆళ్లపల్లి, జీహెచ్‌ఎస్ టేకులపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ చంద్రుగొండ, జెడ్పీహెచ్‌ఎస్ ఎర్రగుంట (అన్నపురెడ్డి మండలం), జెడ్పీహెచ్‌ఎస్ లక్ష్మీదేవిపల్లిలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గత మూడేళ్లలో అడ్మిషన్లు, ఫలితాలిలా..

సంవత్సరం	పదో తరగతి	ఫలితాలు	ఇంటర్మీడియట్	ఫలితాల శాతం
ఖమ్మం జిల్లా				
2022-23	770	26.3	995	48.53
2023-24	789	40.44	881	44.71
2024-25	607	40.44	797	57.93
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా				
2022-23	671	23.66	856	40.48
2023-24	623	32.28	788	50.97
2024-25	538	31.04	728	51.19

సద్వినియోగం చేసుకోవాలి



ఉన్నత చదువులు చదువుకోవడానికి ఓపెన్ స్కూల్ ఒక మంచి అవకాశం. చదువులు మధ్యలో ఆపేసిన వారు, చదవాలనుకునే వారు ఇందులో అడ్మిషన్ పొందొచ్చు. పది, ఇంటర్మీడియట్ చదవాలనుకునేవారు ఈ నెల 11 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలి.

– సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, ఖమ్మం

ఉన్నత విద్యకు దోహదం



ఓపెన్ స్కూల్‌లో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు వెళ్ళిన వారున్నారు. అభ్యర్థుల ఆసక్తి మేరకు ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో కొత్తగా 11 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత అధ్యయన కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి.

– మద్దినేని పాపారావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

మోదీ పాలనలో ఉద్యోగాలు లేవు..



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

సీపీఐ జాతీయ సమితి సభ్యులు హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఏటా రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో రిటైర్మెంట్‌లు తప్ప రిక్రూట్‌మెంట్‌లు లేవని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. సీపీఐ ఖమ్మం నగర 5వ మహాసభ ఆదివారం నగరంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. సభకు ముందు నగరంలో సీపీఐ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. హేమంతరావు మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యమైందని, దేశ సంపదను ప్రైవేట్ వ్యక్తుల చేతులో పెట్టడంలో మోదీ ప్రభుత్వం రికార్డులు సృష్టించిందని విమర్శించారు. అలీన విధానానికి కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతున్నారని మండిపడ్డారు. మతోన్మాద బీజేపీతో దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 18 మాసాలు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడారు. సభలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, నాయకులు మహ్మద్ మౌలానా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, బీజీ క్లెమెంట్, నగర కార్యదర్శి జానీమియా, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేశ్, మేకల శ్రీనివాసరావు, జ్వాలా నర్సింహారావు, యానాలి సాంబశివారెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ పాల్గొన్నారు.

‘అబద్ధాలతోనే రేవంత్ పాలన’



మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

ఖమ్మంరూరల్: అబద్ధాలు చెబుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎదులాపురం సాయిగణేశ్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను నిశితంగా గమనిస్తున్నారని, బీఆర్‌ఎస్ అంటే భరోసా అని, కాంగ్రెస్ అంటే కన్నింగ్ అని పేర్కొన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని, పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టటమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రైతుబంధు నిధులు ఎగ్గొట్టారని, విత్తనాలు, ఎరువుల కోసం క్యూలైన్‌లో అర్ధరాత్రి వరకు నిలడబడాల్సి వస్తోందని తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే కేటీఆర్ విసిరిన సవాల్ స్వీకరించి చర్చకు రావాలని సూచించారు. సమావేశంలో బెల్లం వేణుగోపాల్, భాషబోయిన వీరన్న, ఉన్నం బ్రహ్మయ్య, జర్పుల లక్ష్మణ్‌నాయక్, కోటి సైదారెడ్డి, ఉదయ్, సాడేపొంగు ప్రశాంత్, మాదాసు ఆదాం తదితరులు పాల్గొన్నారు.

లింక్ పంపి.. డబ్బులు చోరీ..

గ్రామీణ ప్రజలను టార్గెట్ చేస్తున్న సైబర్ మోసగాళ్లు



రఘునాథపాలెం: స్మార్ట్‌ఫోన్‌ను ప్రతీ ఒక్కరు విరివిగా వాడుతున్నారు. బ్యాంకింగ్ సేవలు, పేమెంట్ యాప్స్ వాడకం ఎక్కువగా ఉండటంతో సాధారణ ప్రజలు కూడా స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నారు. అయితే, అమాయక ప్రజలు సైబర్ మోసాల బారినపడుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు తప్పుడు యాప్స్, గిఫ్ట్ లింకులు, ఫేక్ కాల్స్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. నగరాల్లోనే కాక, రూరల్ ప్రాంతాల్లోనూ మొబైల్ బ్యాంకింగ్, గూగుల్ పే, ఫోన్ పే వంటివి విస్తృతంగా వాడకంలో ఉన్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న మోసగాళ్లు మొబైల్‌కు సందేశాల రూపంలో ‘గిఫ్ట్ లభించింది’, ‘మీకు లాటరీ వచ్చింది’, లేదా ‘వివరాలు అప్‌డేట్ చేయాలి’ అంటూ తప్పుడు లింకులు పంపుతున్నారు. అమాయకులు వాటిని ఓపెన్ చేస్తే, వారి ఫోన్ హ్యాకింగ్‌కు గురై ఖాతాల్లోని డబ్బులు మాయమవుతున్నాయి. రఘునాథపాలెం మండలంలో ఒక్క వారం వ్యవధిలోనే నాలుగు కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు రూ.50,000 నుంచి రూ.80,000 వరకు నష్టపోయారు. ఇక పరువు పోతుందని భావించి చాలామంది మోసపోయిన విషయాన్ని బయటపెట్టడంలేదు. కాగా, సైబర్ మోసగాళ్లు మరో పంథాను ఎంచుకుంటున్నారు. ‘మీ పిల్లలు కేసులో ఇరుక్కున్నారు.. డబ్బులు పంపించకపోతే అరెస్ట్ చేస్తాం’ అంటూ వాట్సాప్ కాల్స్ చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ తరహా మోసాలతో భయపడిన కొన్ని కుటుంబాలు డబ్బులు పంపించిన ఘటనలు ఉన్నాయి. పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ‘ఏ సందేశమైనా, యాప్ అయినా డౌన్‌లోడ్ చేసేముందు తాను ఎవరితో డీలింగ్ చేస్తున్నానో తెలుసుకోవాలి. ఎవరికైనా డబ్బులు పంపేముందు నమ్మదగిన వ్యక్తుల దగ్గర సలహా తీసుకోవాలి’ అని అధికారులు సూచిస్తున్నారు. సక్రమమైన బ్యాంకింగ్ యాప్‌ల ద్వారా మాత్రమే లావాదేవీలు చేయాలని, గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

రఘునాథపాలెం పీఎస్‌లో 7 కేసులు

ఒక్క రఘునాథపాలెం మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో సైబర్ మోసగాళ్ల వలలో పడి అనేక మంది డబ్బులు పోగొట్టుకున్నప్పటికీ ఏడుగురు బాధితులు మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లోనే ఈర్లపూడి నుంచి శ్రీనివాస్, రఘునాథపాలెం నుంచి శంకర్, పరికలబోడుతండా వాసి సంతోష్, తాటాకులతండా మహిళ ఇచ్చిన ఘటలనపై నాలుగు కేసులు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి..



ప్రతీ ఒక్కరు సైబర్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత మేర తెలిసిన వారి ద్వారానే యాప్‌ల ద్వారా లావాదేవీలు సాగించాలి. వచ్చిన ప్రతి మేసేజ్‌లను క్లిక్ చేయకుండా తెలియక పోతే తెలిసిన వారికి చూపించిన తర్వాతనే ముందుకు సాగాలి. సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి బ్యాంక్ లావాదేవీలను ఆపించాలి. కొత్త వ్యక్తులు పంపే లింక్‌లను ఓపెన్ చేయొద్దు. ఓటీపీలను చెప్పేముందు ఒకటికి రెండు సార్లు ఆరా తీయాలి.

– ఉస్మాన్‌షరీఫ్, సీఐ రఘునాథపాలెం

హైడ్రోజన్ పెరాక్సైడ్ తాగిన బాలుడు..

- తల్లిదండ్రుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

కరకగూడెం: ఓ బాలుడు హైడ్రోజన్ పెరాక్సైడ్ తాగగా.. తల్లిదండ్రుల అప్రమత్తతతో ప్రాణాపాయం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మూడేళ్ల బాలుడు ఆదివారం ఉదయం ఆడుకుంటూ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ ఖాళీ స్ప్రైట్ బాటిల్‌లో నిల్వ ఉంచిన హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణాన్ని చూసి మంచినీళ్లు అనుకుని తాగేసి ఇంటికి వచ్చాడు. ఆతర్వాత కొద్దిక్షణాల్లోనే బాలుడు తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడిపోయి వాంతులు, విరేచనాలు చేసుకుంటూ స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంకటే మణుగూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందించి ఇంటికి పంపించడంతోవారంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఇటువంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుండడంపై వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు విషపూరిత పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలని, ముఖ్యంగా మంచి నీళ్ల లేదా కూల్‌డ్రింక్స్ బాటిళ్లలో రసాయనాలను నిల్వ చేయొద్దని స్పష్టం చేస్తున్నారు.

పుష్కరాల తరుణంలో పెరుగుతున్న స్వరం

- ఏపీ విలీన పంచాయతీలను తిరిగి తేవాలని డిమాండ్
- వసతి, సౌకర్యాలకు భూ సమస్య కూడా తీరే అవకాశం
- భద్రాచలంలో భక్తుల రద్దీగా తగినట్లు ఏర్పాట్లకు స్థలం
- మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు గళమెత్తాలని విన్నపాలు



ఏపీలో విలీనమైన ఎటపాక గ్రామ శివారు ప్రాంతాలు

భద్రాచలం: గోదావరి పుష్కరాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. పన్నెండేళ్లకోసారి జరిగే ఈ క్రతువులో లక్షల కొద్దీ భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. వారందరికీ తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం తాత్కాలిక వసతులు, శాశ్వత నిర్మాణాలు, మరుగుదొడ్లు, అన్నదాన సత్రాలు వంటివి నిర్మించాలి. కానీ భద్రాచలంలో ఇప్పటికే భూ సమస్య వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో పుష్కరాల అభివృద్ధి పనులకు భూమెక్కడ అనే ప్రశ్న తలెత్తోంది. ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేస్తే 2027 జూలైలో జరిగే పుష్కరాలకు భూ సమస్య తీరుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

వసతులు పరిమితం.. అద్దెలు అధికం

శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనం కోసం భద్రాచలం వచ్చే భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. దేవస్థానం కాటేజీలు, వసతి గదులు మాత్రం స్వల్ప స్థాయిలో ఉన్నాయి. దీంతో ప్రైవేట్ లాడ్జీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారాంతపు సెలవు దినాల్లో రూ. వేలల్లో అద్దె వసూలు చేస్తున్నారు. పది వేల మంది భక్తులు వస్తేనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తితే పుష్కరాల సమయంలో రోజుకు లక్షకు పైగా భక్తులు వస్తారు. దీంతో వసతి సమస్య జటిలంగా మారనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా శాశ్వత, తాత్కాలిక వసతి నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే కాళేశ్వరం వంటి పుణ్యక్షేత్రంలో పుష్కరాల పనులకు భూ సర్వే చేస్తున్నారు.

ఐదు పంచాయతీలను కలిపితే భూమి అందుబాటులోకి..

ప్రస్తుతం భద్రాచలానికి మూడు వైపులా కిలోమీటరు పరిధి మించి విస్తీర్ణం లేదు. కానీ ఏపీలో కలిసిన గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం, ఎటపాక, పురుషోత్తపట్నం గ్రామాలు ఇప్పటికీ భద్రాచలంలో అంతర్భాగంగానే ఉన్నాయి. రాష్ట్రాలు వేరయినా దైనందిక కార్యక్రమాలు, పనులు భద్రాచలంతోనే ముడిపడి ఉన్నాయి. ఆ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపితే భద్రాచలానికి భూమి అందుబాటులోకి వస్తుంది. పురుషోత్తపట్నంలో స్వామివారికి సుమారు 900 ఎకరాల భూమి ఉంది. దీంతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. చర్ల రోడ్డులో ఉన్న ఎటపాక, కూనవరం రోడ్డులో ఉన్న గుండాల పంచాయతీల్లో అటు వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. పుష్కరాల నేపథ్యంలో పంచాయతీల విలీన డిమాండ్‌పై స్వరం మరింత పెరుగుతోంది.

మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ చూపాలి

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగ సవరణ ద్వారానే విలీనం పూర్తయ్యే అవకాశం ఉండటంతో పార్లమెంట్ సభ్యుల పాత్రే కీలకం. ఎన్నికల ముందు ఎంపీ బలరాంనాయక్ సైతం ఇదే హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ఇతర ఎంపీల సహాయ సహకారాలతో పార్లమెంట్‌లో ఈ సమస్యను లేవనెత్తాలని బలరాంనాయక్‌ను భక్తులు కోరుతున్నారు. నిజామాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఇటీవల కలిసిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇదే విషయమై విన్నవించారు. పుష్కరాల తరుణంలోనైనా విలీన పంచాయతీలు, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి



మా అభిప్రాయం తెలుసుకోకుండా ఏపీలో విలీనం చేసి అన్యాయం చేశారు. దీని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. పార్టీలన్నీ ఏకమై కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలి. రానున్న పుష్కరాల సమయంలో అందరి దృష్టి భద్రాచలం వైపే ఉంటుంది. పంచాయతీలకు ఇదే సరైన తరుణంగా భావించి ఎంపీలు చొరవ చూపాలి.

– బందారు వీరభద్రం, కన్నాయిగూడెం, విలీన గ్రామపంచాయతీ వాసి

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

రఘునాథపాలెం: ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఆదివారం గుట్టమట్టిని తీసుకొస్తున్న టిప్పర్లను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు చూపించలేదు. దీంతో టిప్పర్లను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

వీఎం బంజర్‌లో చోరీ..

పెనుబల్లి: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని వీఎం బంజర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. జాతీయ రహదారి వెంబడి ఉంటున్న బుక్కా కృష్ణవేణి తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది. ఆదివారం తొలిఏకాదశి పండుగ కావడంతో తెలిసిన వారికి ఇంటికి వెళ్లి శుభ్రం చేయాలని చెప్పడంతో వారు వెళ్లి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. సమాచారాన్ని కృష్ణవేణికి చేరవేయడంతో ఆమె వీఎం బంజర్ చేరుకుంది. శనివారం రాత్రే దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి రెండు బీరువాల్లోని కేజీ వెండి వస్తువులు, 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఘటనా స్థలాన్ని సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగంగౌడ్, ఎస్ఐ వెంకటేశ్‌తో పాటు క్లూస్ టీం పరిశీలించింది.

ఇద్దరిపై కేసు

వేంసూరు: ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కల్లూరుగూడెం గ్రామానికి చెందిన గోళ్ల రామకృష్ణ తన సొంత స్థలంలో ఇంకుడు గుంత నిర్మించేందుకు తాపీ మేస్త్రీతో కలిసి ముగ్గు పోశాడు. పక్క ఇంట్లో ఉన్న నాగా నరేశ్ ఇంకుడు గుంత తవ్వడానికి వీలు లేదంటూ రామకృష్ణపై కర్రతో దాడి చేశాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన్ను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ కుమారుడు గోళ్ల గోపి ఫిర్యాదు మేరకు పోలీసులు నాగ నరేశ్, మాధవిపై కేసు నమోదు చేశారు.

చింతకాని మండలంలో..

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన యడ్లపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. అనంతసాగర్‌కు చెందిన చెందిన యడ్లపల్లి గాంధారికి చెందిన 1.50 ఎకరాల పత్తిపంటపై ఇరువురు వ్యక్తులు కలుపు నివారణ మందు కొట్టారు. దీంతో పంట నాశనమై రూ.60 వేల నష్టం వాటిల్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి..

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలోని ఓ ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతో పత్తిపాక గ్రామానికి చెందిన సోడి లక్ష్మి(45) మృతి చెందింది. లక్ష్మి కొంతకాలంగా బీపీతో బాధపడుతూ శుక్రవారం కింద పడింది. కుటుంబసభ్యులు ఆమెను ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా వైద్యం చేసి, భద్రాచలం తరలించాలని సూచించగా.. వారు అక్కడకు తీసుకెళ్లి చూపించారు. పరిస్థితి విషమంగా మారడంతో ఖమ్మంకు రిఫర్ చేయగా.. అంబులెన్స్‌లో వారితో పాటే సదరు ఆర్‌ఎంపీ వెళ్లడం.. మధ్యలో తరచూ ఆపుతూ వెళ్లడంతో ఖమ్మం చేరేసరికి మృతిచెందింది.